నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 5 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# విద్యార్థినుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయద్దు

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా**

వాంకిడి, నవంబర్ 4: విద్యార్థినుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయవద్దని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం వాంకిడిలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. వంటగది, స్టాక్ రూంతో పాటు ఆర్వో వాటర్ ప్లాంట్‌లో పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హెచ్ఎం శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, వాంకిడి మాజీ జడ్పీటీసీ అజయ్‌కుమార్, పీఏఎంసీ చైర్మన్ జబోరే పెంటు, మాజీ సర్పంచ్‌లు సరస్వతి, అయూబ్, బండే తుకారాం, భీమ్‌రావ్, మధుకర్, కొట్నక శంకర్, వార్డెన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో పరిశుభ్రత పాటించాలి

వాంకిడిలోని బాలిక ఆశ్రమోన్నత పాఠశాలలో పరిశుభ్రత పాటించి విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని సిబ్బందినిఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆదేశించారు. సోమవారం ఆమె పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, భోజనం, వైద్య సేవలపై ఆరాతీశారు. ఆయిల్‌ఫుడ్ అందించవద్దని, పౌష్టికాహారం అందించాలని వార్డెన్‌కు సూచించారు. ప్రతిరోజూ వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాల చుట్టూ మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అనంతరం మంచిర్యాల జిల్లాలోని మాక్స్ కేర్ ప్రైవేట్ దవాఖానకు వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

## ఇంటి బాట పడుతున్న విద్యార్థినులు

మండలంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో వారం క్రితం వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన 30 మంది విద్యార్థినులు చికిత్స పొందుతుండగా గత రెండు మూడు రోజుల్లో మరో 30 మంది వరకు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వాంకిడి ప్రభుత్వ దవాఖానాలోనే సోమవారం 18 మంది, ఆశ్రమోన్నత పాఠశాలలో ఆరుగురు విద్యార్థినులు చికిత్స పొందుతున్నారు. మరికొంతమందిని ఆసిఫాబాద్, కాగజ్ నగర్, మంచిర్యాల, హైదరాబాద్ దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. ఇందులో శైలజ, మహాలక్ష్మి, జ్యోతిక ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దీంతో మిగతా విద్యార్థినులు భయాందోళనకు గురై ఇంటిబాట పడుతున్నారు. ఆశ్రమంలో 590 మంది విద్యార్థినులు ఉండగా ప్రస్తుతం 95 మంది మాత్రమే ఉన్నారు. బయట ఫుడ్ తెచ్చుకొని తినడం ఇలా జరిగిందని హెచ్ఎం, వార్డెన్‌లు చెబుతుండగా నాణ్యత లేని రంగు మారినా భోజనం తిన్న తర్వాతే అస్వస్థతకు గురైనట్లు విద్యార్థినులు తెలిపారు. ఐదు రోజులైనా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎలాంటి రిపోర్టు ఇవ్వకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, నవంబర్ 4 : వాంకిడిలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌కు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, జాడి విలాస్, హరిశ్చంద్ర ప్రసాద్ వినతి పత్రం అందించారు.



దవాఖానలో విద్యార్థుల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న పీవో ఖుష్బూ గుప్తా

# వైద్య వృత్తి ఎంతో విలువైనది


**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల అర్బన్, నవంబర్ 4: ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య వృత్తి ఎంతో విలువైనదని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ దావుద్ సులేమాన్‌తో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్య కళాశాలలో మూడవ బ్యాచ్ కొనసాగుతుందని, వైద్య విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థిని విద్యార్థులకు ఏదైనా సమస్య, అవసరాలుంటే తన దృష్టికి తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

# హస్తంలో మార్కెట్ కమిటీ మంటలు




**చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం తీవ్రపోటీ**

- ప్రతిసారి చెన్నూర్, కోటపల్లి మండలాల వారే చైర్మన్లు
- ఈసారి పాత జైపూర్ మండల నాయకుడికి అవకాశం ఇవ్వాలంటూ పట్టు
- తన అనుచరులకే చైర్మన్ పదవి ఇవ్వాలంటూ షాడో ఎమ్మెల్యే పైరవీ
- చెన్నూర్ కాంగ్రెస్‌లో ముదిరి పాకాన పడుతున్న అంతర్గత విబేధాలు
- ఎమ్మెల్యే వివేక్‌కు తలనొప్పిగా మారిన మార్కెట్ కమిటీ చైర్మన్ గిరి

మంచిర్యాల, నవంబర్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో తీవ్రమైన పోటీ నెలకున్నది. ఆ పార్టీ నాయకులు ఎవరికీ వారే చైర్మన్ పదవి దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే వివేక్‌పై ఆ నాయకులు ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు గెలిచిన వెంటనే తన పరిధిలోని మార్కెట్ కమిటీలను నియమించారు. చెన్నూర్ మార్కెట్ కమిటీ విషయంలో మాత్రం స్థానిక ఎమ్మెల్యే ముందు నుంచి దాటవేసే ధోరణి అవలంబిస్తున్నారు. ముందు ఎంపీ ఎన్నికలు అయ్యాక చూద్దామని చెప్పిన ఆయన ఇప్పుడు మంత్రి పదవిపై క్లారిటీ వచ్చాక చూద్దామంటూ నాయకులకు చెప్తున్నట్లు తెలిసింది. దీంతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచి, కొడుకును ఎంపీగా గెలిపించుకుని పదవులు అనుభవిస్తున్నాడని, మాకు పదవి ఇచ్చేందుకు మాత్రం ఆయనకు మనసు రావడం లేదంటూ కాంగ్రెస్ నాయకులే మండిపడుతున్నారు. ఒకవేళ మంత్రి పదవి వేరే వాళ్లకు వస్తే చెన్నూర్ మార్కెట్ కమిటీకి చైర్మన్‌నే నియమించరా? అని ప్రశ్నిస్తున్నారు.

## పదవి కోసం పట్టు

చెన్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఇస్తే చెన్నూర్ లేదా కోటపల్లి మండలాలకు చెందిన నాయకులే ఇస్తారు తప్పితే.. వేరే మండలాల వారికి ఇవ్వరనే చర్చ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో నడుస్తున్నది. షాడో ఎమ్మెల్యేగా చెప్పుకునే కోటపల్లికి చెందిన ఓ లీడర్ ఆయన అనుచరుల్లో ఒకరికి చైర్మన్ పదవి ఇవ్వాలంటూ ఎమ్మెల్యేపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. మా సామాజిక వర్గం లేకపోతే నియోజకవర్గంలో పార్టీకి ఇబ్బందులు తప్పవని.. మా వాళ్లకే పదవి ఇవ్వాలంటూ ఆయన పట్టుపడుతున్నట్లు సమాచారం. ఈసారి బీసీలకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని రిజర్వ్ చేయడంతో తన ఇంట్లో పని చేసే ఓ వ్యక్తికి ఈ పదవి ఇవ్వాలంటే సదరు నేత ప్రయత్నిస్తున్నారట. షాడో ఎమ్మెల్యే చేతిలో కీలుబొమ్మగా మారిన ఎమ్మెల్యే వివేక్ ఆయన చెప్పిన వ్యక్తికే చైర్మన్ పదవి ఇస్తారేమో అని పదవి ఆశించే మిగిలిన నాయకులు భావిస్తున్నారు. ఇక చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఓ బీసీ లీడర్‌కు ఎమ్మెల్యే వివేక్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇస్తానని మాట ఇచ్చారనే చర్చ నడుస్తున్నది. వీరితోపాటు ఎప్పటి నుంచో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి పోటీ పడుతున్న భీమారం మండలానికి చెందిన ఓ బీసీ లీడర్ పేరు వినిపిస్తుంది. ఎప్పటిలాగే చెన్నూర్, కోటపల్లి వాళ్లకు కాకుండా ఈసారి పాత జైపూర్ మండలానికి చెందిన తనకు అవకాశం ఇవ్వాలని ఆయన పట్టుపడుతున్నారు. పార్టీ కోసం కష్టపడ్డానని, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పైసా ఆశించకుండా పనిచేశానని, చైర్మన్ పదవి తనకే ఇవ్వాలని ఆ లీడర్ ఈ మధ్య ఓ వీడియోను విడుదల చేశారు. ఎమ్మెల్యే కొడుకును ఎంపీ చేసుకున్నట్లే మా లాంటి యువకులు, చదువుకున్న వారికి చైర్మన్ పదవి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే బీసీ సంఘాల నాయకులు, సర్పంచ్ సంఘం నాయకులు ఆయనకే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి పత్రాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చైర్మన్ పదవి రేసులో ఆయన అందరి కంటే ముందున్నారనే చర్చ ఇప్పుడు చెన్నూర్‌లో నడుస్తున్నది. మార్పు అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్.. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి విషయంలోనూ అదే అవలంబించాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

## ఎమ్మెల్యేకు తలనొప్పిగా వ్యవహారం

ఇలా ఎవరికి వారు పైరవీలతో వస్తుండడంతో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎమ్మెల్యే వివేక్‌కు తలనొప్పిగా మారింది. ఒకవేళ షాడో ఎమ్మెల్యే చెప్పిన వ్యక్తికి లేదా కిష్టంపేట లీడర్‌కు ఇద్దరిలో ఎవరికి ఇచ్చిన జైపూర్ మండలం నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. జైపూర్ మండలానికి చెందిన లీడర్‌కు ఇస్తే షాడో ఎమ్మెల్యే ఎలా రియాక్ట్ అవుతారోనని ఎమ్మెల్యే వెనకడువేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఒకరికి పదవి ఇచ్చి మరొకరి ఇవ్వకపోతే పార్టీకి ఇబ్బంది అని ఎమ్మెల్యే భావిస్తున్నట్లు సమాచారం. ఇన్ని రోజులు కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా ఉన్న ఈ వ్యవహారం ఇప్పుడు ముదిరి పాకాన పడింది. ఎవరికిచ్చినా పర్లేదు కానీ యువకులు, చదువుకున్న వారికి పదవి ఇవ్వాలనే డిమాండ్ ఓ వర్గం నుంచి వినిపిస్తున్నది. ఎమ్మెల్యే తన కొడుకును ఎంపీగా గెలిపించుకోవడానికి ముందు నియోజకవర్గంలో యువ నాయకత్వానికి అవకాశాలిస్తామని ప్రకటించారు. ఆ మేరకు యువకులకు మార్కెట్ కమిటీ చైర్మన్ ఇవ్వాలనే చర్చ జోరుగా నడుస్తున్నది. ఎప్పటిలాగే మార్కెట్ కమిటీ పదవిని చెన్నూర్, కోటపల్లికే పరిమితం చేయకుండా పాత జైపూర్ మండలానికి ఇవ్వాలని ఇక్కడి నాయకులు అంటున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఎవరికి అవకాశం ఇస్తారన్నది ఆసక్తిగా మారింది. షాడో ఎమ్మెల్యే చెప్పిన వారికి ఇచ్చి తాను కీలుబొమ్మ ఎమ్మెల్యే అనే వాదనకు బలం చేకూరుస్తారా.. లేక ప్రజాభీష్టం, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను పరిగణిలోకి తీసుకుని మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై నిర్ణయం తీసుకుంటారా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# అర్జీల పరిష్కారానికి చర్యలు

**కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, నవంబర్ 4 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టా మార్పిడి, భూ సమస్యలు, దివ్యాంగ, వృద్ధాప్య, వితంతు పింఛన్ మంజూరు చేయాలని, రుణమాఫీ చేయాలని, తదితర సమస్యలపై అర్జీలను ప్రజలు అందించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అర్జీలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

## సర్వేను సమన్వయంతో పూర్తి చేయాలి

ఇంటింటా సమగ్ర సర్వేను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి మండల ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

## అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

నస్పూర్, నవంబర్ 4 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ మోతీలాల్, వివిధ శాఖల అధికారులతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు భూసమస్యలు, పింఛన్లు, ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తులు అందించారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే





జైనూర్ మండలంలో లంచం తీసుకుంటూ ఇటీవల ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, కార్యదర్శి(ఫైల్)

# అక్రమార్కులపై ఏసీబీ ఫోకస్

- జిల్లాలో లంచం తీసుకుంటూ వరుసగా పట్టుబడుతున్న అధికారులు
- దాడులతో అవినీతిపరుల గుండెల్లో గుబులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ): అక్రమ సంపాదనకు అలవాటు పడి ప్రజలను లంచాల కోసం వేధిస్తున్న అధికారుల్లో ఏసీబీ దాడులు దడ పుట్టిస్తున్నాయి. వరుసగా జరుగుతున్న దాడుల్లో లంచాలు తీసుకున్న అధికారులు పట్టుబడుతున్నారు. ఈ అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. శనివారం జిల్లాలోని జైనూర్ మండలం పోచ్చంలొద్ది గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి తిరుపతి(తహసీల్దార్) తో పాటు కార్యదర్శి శేఖర్ రూ.12వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఒకేసారి ఇద్దరు అక్రమార్కులు ఏసీబీకి పట్టుబడడం ఇదే మొదటిసారి. ఉపాధి పనుల్లో నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నుంచి రూ.12వేల లంచం తీసుకుంటున్న ఘటనలో తహసీల్దార్‌తో పాటు గ్రామకార్యదర్శి ఏసీబీకి చిక్కడం రెవెన్యూ శాఖలో సంచలనం రేపింది.

## జిల్లాలో ఇటీవల జరిగిన దాడులు..

6 నెలల క్రితం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న రాజ్యలక్ష్మి ఒకరికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.25వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. జిల్లాలో నిర్మించిన జాతీయ రహదారికి సంబంధించి భూ నష్టపరిహారం చెల్లింపులో జరిగిన అక్రమాలపై ఏసీబీ అధికారులు విచారణ చేపట్టి దాదాపు రూ.4కోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. దహేగాం మండలంలో 2013లో అప్పటి తహసీల్దార్ అమృతసాగర్, 2016లో మరో తహసీల్దార్ విశ్వంబర్ లంచాలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. 5 నెలల క్రితం దహేగాం వ్యవసాయాధికారి వంశీకృష్ణ ఫర్టిలైజర్ రెన్యూవల్ కోసం లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. వివిధ పనుల కోసం అధికారులను సంప్రదించే ప్రజలను పీడిస్తూ పనులు చేయడంలో కాలయాపన చేస్తున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడి లంచం చెల్లించనిదే పనులు చేయబోమనే రీతిలో కొందరు అధికారులు వ్యవహరిస్తుండడంతో బాధితులు గత్యంతరం లేక ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ఇలా వరుసగా జరుగుతున్న ఏసీబీ దాడులు అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.



ఎస్ఆర్పీ 3గనిపై ఆందోళన చేస్తున్న ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు వీరమల్లు

# ఐఎన్‌టీయూసీలో భగ్గుమన్న విభేదాలు

- ఎస్ఆర్పీ 3గని పిట్ సెక్రటరీగా గోపాల్‌రెడ్డి నియామకంపై నిరసన
- తనకు అన్యాయం చేశారంటూ ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు వీరమల్లు ఆందోళన

శ్రీరాంపూర్, నవంబర్ 4 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ-3గనిలో ఐఎన్‌టీయూసీలో నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. ఎస్ఆర్పీ-3 గని ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శిగా గోపాల్‌రెడ్డిని నియమించడంపై సీనియర్ నాయకుడు వీరమల్లు నిరసన తెలిపాడు. సీనియర్‌గా ఉన్న తనను కాదని ఇతర యూనియన్ నుంచి వచ్చిన వ్యక్తిని ఎలా నియమిస్తారని ప్రశ్నిస్తూ నాయకత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. పిట్ కార్యదర్శిగా నియమించబడ్డ వ్యక్తిపై విమర్శలు చేశాడు. అతని ప్రవర్తనపై కార్మికులను చేతులెత్తి అభిప్రాయం చెప్పాలని కోరడంతో గనిపై 500 మంది కార్మికులు ముక్త కంఠంతో పిట్ కార్యదర్శిగా వ్యతిరేకించారు. యూనియన్ అసలైన కార్యకర్తలను కేంద్ర నాయకత్వం పట్టించుకోవడం లేదని, అడుగులకు మడుగులొత్తే వారికే పదవులు ఇస్తున్నారని వీరమల్లు ఆరోపించాడు. అవినీతి పరులను అందలమెక్కిస్తున్నారని విమర్శించాడు. వెంటనే పిట్ కార్యదర్శి నియామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశాడు. లేదంటే యూనియన్‌లోని అంతర్గత అవినీతి బయట పెడుతానని హెచ్చరించడం గమనార్హం.

# నేడు నాగుల చవితి

**పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు**

చెన్నూర్ టౌన్, నవంబర్ 4 : భారతీయ సంప్రదాయంలో నాగ ఆరాధనకు విశేషమైన ప్రాముఖ్యమున్నది. ప్రకృతిని ఆరాధించడం మన సంప్రదాయం. ప్రాచీన కాలం నుంచీ అనాదిగా వస్తున్నది. కార్తీక మాసంలో దివ్యమైన వ్రతం వచ్చే తిథిగా నాగుల చవితిని పేర్కొంటారు. కార్తీక మాసంలో శుక్ల పక్షంలో చతుర్థి (చవితి) తిథిని నాగ చతుర్థి నాగుల చవితి)గా పిలుస్తుంటారు. తెల్లవారుజామునే స్నానాలు చేసి, పుట్టల్లో పాలు పోసి, నాగ సర్పాలను ప్రత్యేకంగా పూజిస్తుంటారు. నాగుల చవితిని నేడు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోనున్నారు.

## ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

నాగుల చవితి కోసం మంచిర్యాల జిల్లాలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. చెన్నూర్‌లోని శివాలయంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయంలో ఉన్న నాగదేవత విగ్రహాలు, ఆలయంలో ప్రవేశించగానే ఎడమవైపున ఉన్న పుట్టను శుభ్రం చేశారు. పుట్టలో పాలుపోసేలా పట్టణంలోనూ పలు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు (ఫైల్)

# హ్యాండ్ బాల్ టోర్నీ విజేతగా ఉమ్మడి ఆదిలాబాద్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, నవంబర్ 4: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో దివంగత వ్యాయామ ఉపాధ్యాయుడు గడిగొప్పుల సదానందం జ్ఞాపకార్థం నిర్వహించిన 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ టోర్నీ విజేతగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు నిలిచింది. సోమవారం ఫైనల్‌లో మహబూబ్‌నగర్‌తో హోరాహోరీగా పోటీలో 6 పాయింట్ల తేడాతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విజయ జట్టు విజయకేతనం ఎగురవేసింది. రెండో స్థానంలో మహబూబ్ నగర్ జట్టు నిలిచింది. మూడు రోజుల పాటు క్రీడలు ఉత్సాహంగా కొనసాగాయి. పట్టణ సీఐ రవీందర్, రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్యామల పవన్ కుమార్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి కనపర్తి రమేశ్, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సునార్కర్ అరవింద్‌లు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ మెంబర్ కడతల రాకేశ్, ఏసీఎంఓ ఉద్ధవ్, పాఠశాల ఎచ్.ఎం జంగు,కోచ్ లు విద్యాసాగర్,రవి తిరుమల్ పీడీ విశాల, పీఈటీలు రాజలింగు, కల్యాణ్, సాయి, రమేశ్, కాంగ్రెస్ నాయకులు గుండ శ్యామ్, ముసడే చరణ్, సీనియర్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ రవీందర్, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, నాయకులు

